సాక్షి
కామారెడ్డి
గురువారం । 29 । ఆగస్టు । 2024



వైద్యులపై రోగుల ఆగ్రహం

పిట్లం సీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రోగులు ఆందోళన చేపట్టారు.

- 8లో ▸



నిలిచిన మార్కెట్ పనులు

నిధులు విడుదల చేయకపోవడంతో కామారెడ్డిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /21.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

భయపెడుతున్న జ్వరాలు!

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటా చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ల గురించే చర్చ నడుస్తోంది. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరిని సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వచ్చి ఎంతకూ తగ్గడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ఎంతకూ తగ్గని టెంపరేచర్
- బాడీ పెయిన్స్, దగ్గు, జలుబుతో ప్రజల ఇబ్బందులు
- చాలా మందిలో బ్లడ్ ఇన్‌ఫెక్షన్
- ఇంటింటా జ్వర బాధితులే
- నియంత్రణ చర్యల్లో అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: సీజన్ మారినపుడు సాధారణంగా జ్వరాలు వస్తాయి. వర్షాకాలం ఆరంభమైన తర్వాత అపరిశుభ్ర వాతావరణం, వర్షపు నీరు నిలిచి దోమలు విజృంభించి వ్యాధులకు కారణమవుతాయి. ఈ సీజన్‌లో చాలా మందికి జలుబు, దగ్గు, జ్వరం వస్తుంటాయి. అయితే ఈ సారి మాత్రం జ్వరాలు విచిత్రంగా కనిపిస్తున్నాయి. వైద్యులు కూడా జ్వరపీడితులు చెప్పే లక్షణాలను చూసి విస్తుపోతున్నారు. జ్వరం వస్తే సాధారణ యాంటీ బయోటిక్స్ ఇస్తారు. ఇప్పుడు సాధారణ యాంటీ బయోటిక్స్‌కు తగ్గడం లేదు. దీంతో ఎక్కువ డోస్ ఉన్న మందులు వాడుతున్నారు. జ్వరం వచ్చిన చాలా మంది బ్లడ్ ఇన్‌ఫెక్షన్, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. జ్వరంతో పాటు దగ్గు, జలుబు ఇబ్బంది పెడుతున్నాయి. మరికొందరికి నోరోంతా పుచ్చిపోయి ఇబ్బంది పడుతున్నారు. ఒకేసారి అన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో జనం భయాందోళనలకు గురవుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో డెంగీ కేసులు 115 నమోదయ్యాయి. జ్వరాల బారిన పడిన వారి సంఖ్య 2,149 మంది. అధికారుల దృష్టికి రాని కేసులు చాలానే ఉన్నాయి. చాలా మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు.

పడిపోతున్న ప్లేట్‌లెట్స్

తీవ్రమైన జ్వరంతో ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో చాలా మందికి బ్లడ్ ఇన్‌ఫెక్షన్ అయినట్టు పరీక్షల ద్వారా తెలుస్తోంది. ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి అవసరమైన వైద్యం చేస్తున్నారు. కొందరికి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. దీంతో వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుంటున్నారు. బ్లడ్‌లో ఇన్‌ఫెక్షన్ ఉందని తేలడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల జిల్లాలో పలువురు జ్వరాల బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందారు. వందలాది మంది మంచం పట్టారు. ఈ నేపథ్యంలో జ్వరాల వ్యాప్తికి ఏదో వైరస్ కారణమై ఉంటుందని వైద్యులు అనుమానిస్తున్నారు. అయితే ఆ వైరస్ ఏంటో ఎవరికీ అంతుబట్టడం లేదు.

జిల్లాలో జ్వర సర్వే వివరాలు..

వైద్య సిబ్బంది సందర్శించిన గృహాలు :	1,17,041
స్క్రీనింగ్ చేసిన వ్యక్తుల సంఖ్య :	3,49,810
జ్వరాలతో బాధపడుతున్న వారు :	2,149
డెంగీ కేసులు :	115
టీ హబ్‌లో చేసిన పరీక్షలు :	6,335



కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

మందులు వాడినా..

జ్వరాల బారిన పడిన వారిలో చాలా మంది ఒంటి నొప్పులతో పాటు జలుబు, దగ్గుతో బాధ పడుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదని వాపోతున్నారు. కొందరు పేషెంట్లు వైద్యులు ఇస్తున్న మెడిసిన్ వాడుతూనే, ఇంటి చిట్కాలు పాటిస్తున్నారు. అయినా నొప్పులు తగ్గడం లేదు. దగ్గు, జలుబు వీడడం లేదు. కొందరికి 102 డిగ్రీల మించి జ్వరం ఉంటుంది. మందులు ఎక్కువగా వాడితే మరిన్ని సమస్యలు వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. మరోవైపు అధికారులు జిల్లాలో సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వివరాలు సేకరిస్తున్నారు. జ్వరాల తీవ్రత ఎక్కువ ఉన్న చోట వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది.

వైద్యులు శ్రమిస్తున్నారు



జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలకు వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 1,17,041 ఇళ్లను సందర్శించి 3,49,810 మందిని పరీక్షించారు. టీ హబ్‌లో 6,335 పరీక్షలు నిర్వహించాం. అయితే చాలా చోట్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, వర్షపు నీరు నిలిచిపోయి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో

‘విత్తన క్షేత్రం’లో సాగు లేనట్లే!



సాగు చేయకపోవడంతో ఖాళీగా ఉన్న విత్తనోత్పత్తి క్షేత్రంలోని భూమి

- పోచారం ప్రాజెక్ట్‌లోకి సకాలంలో నీరు రాకపోవడమే కారణం
- బీళ్లుగా మారిన విత్తన క్షేత్ర భూములు



సాగునీరు లేకపోవడంతో బోసిపోతున్న కాలువ

నాగిరెడ్డిపేట: వందల ఎకరాల భూమి ఉన్నప్పటికీ గుంట భూమి కూడా సాగుకు నోచుకోలేని దుస్థితికి చేరింది నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రం. ఒకప్పుడు ఆధునిక వంగడాలను ఉత్పత్తిచేస్తూ తెలంగాణ ప్రాంతంలోనే పేరుగాంచిన విత్తనోత్పత్తి క్షేత్రం ప్రస్తుతం పంటలసాగుకు దూరమై కళావిహీనమైంది. వందల ఎకరాల భూమి కలిగిన క్షేత్రంలో ఒక గుంటలో కూడా పంటలను సాగు చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులోని విత్తనోత్పత్తి క్షేత్రంలో సుమారు 800ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 500ఎకరాలు సాగుకు అనుకూలం. కాగా క్షేత్రంలో పంటల సాగుకు పోచారం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి విడుదలయ్యే నీటిని వినియోగిస్తారు. దీనికితోడు క్షేత్రంలో సుమారు పది బోర్లు ఉన్నాయి. పోచారం ప్రధాన కాలువలోకి విడుదలయ్యే నీరు విత్తన క్షేత్రంలోని బావిలోకి చేరుతుంది. అక్కడి నుంచి రెండు 30 హెచ్‌పీ మోటార్ల ద్వారా నీటిని క్షేత్ర భూములకు ఎత్తిపోస్తారు. నాలుగైదు ఏళ్ల క్రితం వరకు వంద ఎకరాలకుపైగా పంటలను సాగు చేసేవారు. తర్వాత సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఈ క్రమంలో ఈ యేడు ఖరీఫ్ సీజన్‌లో ఒక్క గుంటలో కూడా పంటలు వేయడంలేదు.

సాగునీరు లేకపోవడంతో..

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో పంటల సాగుకు పోచారం ప్రాజెక్ట్ నీరే ఆధారం. క్షేత్రంలో పంటల సాగు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. కానీ అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతోపాటు ప్రాజెక్టులోకి సకాలంలో వరదనీరు చేరకపోవడంతో సాగుకు పనులు చేపట్టలేదు.

– హరివెంకట ప్రసాద్, ఇన్‌చార్జి ఏడీఏ, విత్తనోత్పత్తిక్షేత్రం

ప్రాజెక్టులోకి ఆలస్యంగా వరద

పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు ఆలస్యంగా చేరడంతోనే విత్తనోత్పత్తి క్షేత్రంలో పంటలు వేయలేదని తెలుస్తోంది. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి ఆశించనంతమేర వరదనీరు చేరలేదు. దీంతో విత్తన క్షేత్రంలో పంటల సాగుపై అధికారులు కొలిక్కి రాలేకపోయారు. దీనికితోడు క్షేత్రంలో చేపట్టే పంటలసాగుకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిరా వారి నుంచి అనుమతులు రాకపోవడంతో స్థానికంగా ఉన్న అధికారులు సాగు పనులు ప్రారంభించలేదు. ఈ నెల 15న పోచారం నుంచి మొదటి విడతగా నీటివిడుదల చేపటినప్పటికీ విత్తనక్షేత్రంలో సాగు పనులు చేపట్టలేదు. ఫలితంగా క్షేత్ర భూములు బీళ్లుగా దర్శనమమిస్తున్నాయి.

న్యూస్‌రీల్

కుటుంబ నిర్ధారణ సర్వే షురూ



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణకు సంబంధించిన సర్వే బుధవారం ప్రారంభమైంది. యాప్‌లో ఆ రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా, మధ్యాహ్నం తర్వాత యాప్ పనిచేయడంతో కొన్ని మండలాల్లో సర్వే నిర్వహించారు. మిగతా మండలాల్లో గురువారం మొదలు పెట్టనున్నారు. జిల్లాలో 12,056 మంది రైతులకు సంబంధించి కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉంది. పది రోజుల్లోగా సర్వేను పూర్తి చేయాల్సి ఉంటుంది. తొలిరోజు యాప్ ఓపెన్ కాకపోవడంతో కొన్ని చోట్ల ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల మధ్యాహ్నం నుంచి మొదలైంది. ఆయా మండలాల ఏవోలు రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. గురువారం నుంచి సర్వే వేగవంతమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి




మద్నూర్(జుక్కల్): ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటర్ కార్డుకు, ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. మృతి చెందిన వారి పేర్లను తొలగించడానికి డెత్ సర్టిఫికెట్ జత చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ ఎండీ ముజీబ్, ఎంపీడీవో రాణి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ ఉన్నారు.

హామీని అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టి, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. గత సెప్టెంబర్‌లో సమ్మె చేస్తున్న తమ వద్దకు రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చి మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. అప్పుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. యోగి, భాను రాములు, కల్యాణ్, శైలజ, సంతోష్‌రెడ్డి, సంధ్య, సాయిలు, సంజీవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు గుర్తింపు



కామారెడ్డి క్రైం: బాన్సువాడకు చెందిన పిచ్చుక హన్మాండ్లు అనే విశ్రాంత ఉపాధ్యాయుడు మొక్కల సంరక్షణ కోసం చేస్తున్న సేవలను గుర్తించి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం తన ఛాంబర్‌లో సన్మానించారు. హన్మాండ్లు తన ఇంటి ఆవరణలో 300 మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. అంతేకాకుండా తాను బోధించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించి సంరక్షణ చర్యలు చేపట్టారు.

సహకార అధికారిగా మమత



కామారెడ్డి క్రైం: జిల్లా సహకార అధికారిగా బి మమత నియమితులయ్యారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన వసంత హైదరాబాద్ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా చాలా రోజులుగా నిజామాబాద్ సహకార అధికారి శ్రీనివాస్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. బదిలీపై వచ్చిన బి మమత బుధవారం బాధ్యతలు చేపట్టారు. టీఎన్‌జీవోస్ ప్రతినిధులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అటవీ భూముల రక్షణకు కదిలిన గ్రామస్తులు



అటవీ అధికారులతో కలిసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న గ్రామస్తులు



అటవీ భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలోకి గ్రామస్తులు తోలిన పశువులు

గాంధారి(ఎల్లారెడ్డి): అటవీ భూముల రక్షణకు గాంధారి మండలంలోని గౌరారం గ్రామస్తులు నడుం బిగించారు. బుధవారం అటవీ శాఖ అధికారులను పిలిపించి గ్రామ శివారులో ఆక్రమణకు గురైన భూములను చూపించారు. గ్రామస్తులు ఆగ్రహంతో అటవీ భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటల్లోకి పశువులను తోలి మేపారు. ఫారెస్టు అధికారులు సర్వే చేయించి గౌరారం గ్రామ శివారులో ఎంత అటవీ భూమి ఉందో గుర్తించి చుట్టూ కందకాలు తీయించాలని డిమాండ్ చేశారు. అటవీ భూముల ఆక్రమణను ఫారెస్టు అధికారులు అడ్డుకోవడం లేదని, పైగా కొందరు అధికారులు డబ్బులకు కక్కుర్తి పడి ఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఎవరు అటవీ భూములను ఆక్రమించినా సహించేది లేదని హెచ్చరించారు. గ్రామస్తులకు తాము అండగా ఉంటామని అటవీ అధికారులు పేర్కొన్నారు. కామారెడ్డి, బాన్సువాడ ఫారెస్టు డివిజన్ అధికారులు తండాకు వచ్చారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి


- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: పండుగలు ప్రశాంతామైన వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు మాత్రమే ఉత్సవాలు నిర్వహించాలన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పోలీసు బందోబస్తు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో విద్యుత్, ఫైర్, అంబులెన్స్, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇదే సమయంలో మిలాద్- ఉన్-నబీ పండుగ కూడా ఉంటుంది కాబట్టి అధికారులు, మత పెద్దలు పరస్పర అవగాహన, సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎస్పీ సింధుశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: నూతన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. ఓటరు జాబితా సవరణపై బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా నమోదు నియంత్ర ప్రక్రియ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పార్టీల ప్రతినిధులు కిరణ్, మహమ్మద్ సర్వర్, వేణు, సంతోష్ రెడ్డి, జఫర్ ఖాన్, ఖాసీం అలీ, హరిలాల్, లాల్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

పలుకుదాం.. పంచుదాం!

- తెలుగుభాషపై తగ్గుతున్న ఆదరణ
- మేల్కొనాల్సిందే అంటున్న భాషాభిమానులు
- నేడు తెలుగు భాషా దినోత్సవం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అమ్మ ప్రేమంత కమ్మదనాన్ని పంచేది తెలుగు భాష. మమ్మీ, డాడీ సంస్కృతి పెరిగిన తర్వాత అమ్మ భాషకు ఆదరణ కొరవడుతోంది. అక్షరాలు నేర్చుకునే దశ నుంచే పిల్లలకు పరభాషను నేర్పిస్తున్నాం. తెలుగు మాట్లాడడం, పదాలు తెలుసుకోవడం, భావ వ్యక్తీకరణలో చాలా మంది పిల్లలు వెనకబడుతున్నారు. భాషను మాట్లాడేవారు తగ్గిపోతే క్రమంగా అంతరించిపోతుందని భాషాభిమానులు ఆందోళన చెందుతున్నారు. పది మంది పలుకుతూ వంద మందికి పంచితే వెలుగులీనుతుందని పేర్కొంటున్నారు. నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అమ్మ భాషపై మమకారం విషయంలో పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర, కర్నాటకతో పాటు తమిళనాడు రాష్ట్రాల్లో అక్కడి ప్రజలు వారి భాషను ఆదరిస్తున్నారు. వాళ్లకు ఏ భాష వచ్చినా మాతృభాషలోనే మాట్లాడుతారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇతర భాష వాడతారు. మనం మాత్రం తెలుగు భాషను మరచిపోతున్నామనే చెప్పాలి. పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే ఆంగ్లం రావాలని పిల్లలను ఆంగ్ల మాధ్యమాల్లో చేర్పిస్తున్నారు. అయితే వారికి తెలుగు తెలియకుండా పోతుందనే విషయాన్ని గుర్తించడం లేదు. ఇతర దేశాలకు వెళ్లి స్థిరపడిన మనవాళ్లు అక్కడ తమ్మ పిల్లలకు తెలుగు నేర్పించే ప్రయత్నం చేస్తుంటే, మనం మాత్రం ఆంగ్లంపై మోజుతో తెలుగును విస్మరిస్తున్నాం. పాఠశాల స్థాయిలో పదో తరగతిలో పలువురు విద్యార్థులు తెలుగులో ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. ఇతర సబ్జెక్టుల్లో పాస్ అవుతున్నా తెలుగులో మాత్రం వెనుకబడుతున్నారు. ఇంటర్ వచ్చేసరికి మార్కుల కోసం తెలుగును పక్కన పెట్టి సంస్కృతంను ఎంచుకుంటున్నారు. దీంతో ఇప్పటి విద్యార్థులు తెలుగుకు దూరం అవుతున్నారు.

చిన్నప్పటి నుంచే నేర్పాలి

మనం రాసే, మాట్లాడే భాష క్లిష్టంగా ఉంటే ఎవరికీ అర్థం కాదు. అర్థం కాని భాషతో సమాజానికి మేలేంటి అని గిడుగు రామ్మూర్తి పంతులు వాదించేవారు. వ్యవహారిక భాష ఔనత్యాన్ని ఆయన చాటి చెప్పారు. ఆయన చూపిన బాటలో మనం కూడా తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. దీని కోసం పిల్లలకు చిన్నప్పటి నుంచే ఏ ఫర్ ఆపిల్, బీ ఫర్ బాల్ అని నేర్పడంతో పాటు తెలుగు వర్ణమాల, పదాలు నేర్పాలి. కథలు, పాఠాల ద్వారా వారికి తెలుగుపై మమకారం కలిగించాలి.

తెలుగులోకి అనువదించాలి



రచనలు గ్రాంథిక భాషలో కొనసాగుతున్న కాలంలో సామాన్యుల వద్దకు భాష వెళ్లాలని గిడుగు రామ్మూర్తి పంతులు ఉద్యమాన్ని నడిపారు. గ్రాంథికం నుంచి వ్యవహారిక భాషలోకి వెళ్లడానికి కృషిచేశారు. జ్ఞానం అందరికి అందాలంటే భాష సరళంగా ఉండాలి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదిస్తే విద్యార్థులు మాతృభాషను నేర్చుకుంటారు.

– వి శంకర్, తెలుగు అధ్యాపకుడు, రచయిత

భాషను కాపాడుకోవాలి



ఒక జాతి నాగరికత, సంస్కృతిని భాష ప్రతిబింబిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాషాభివృద్ధిలో కీలకమైన విద్యారంగంలో మాత్రం పరిస్థితి నిరాశజనకంగా ఉంది. తెలుగుపై విద్యార్థులకు అభిరుచి పెంపొందించే దిశగా తెలుగు భాషా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలు కూడా ఉండాలి.

– నమిలికొండ సునీత, తెలుగు ఉపాధ్యాయురాలు

మాతృభాష పునాదిలాంటిది




ఏ భాష నేర్చుకోవాలన్నా దానికి పునాది మాతృభాషనే. మాతృభాష లేకుండా ఏ భాషలోనూ పట్టు సాధించలేరు. తెలుగు భాషకు ఉన్న గొప్పతనం మరే భాషకూ లేదు. ఎన్ని భాషలు వచ్చినా తెలుగు సజీవంగానే ఉంటుందన్న విశ్వాసం పెంచుకోవాలి. ఇతర భాషలతో కొన్ని పదాలు దూరం కావచ్చు గానీ, భాష ఎక్కడికీ పోదన్న విషయాన్ని గుర్తించాలి.

– రూప్‌సింగ్, తెలుగు ఉపాధ్యాయుడు

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ సింధు శర్మ




మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన నెలవారి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎస్‌ల వారీగా కేసుల పురోగతిపై సమీక్షించారు. మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ గొడవలు, నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, శ్రీనివాసులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై రోగుల ఆగ్రహం

- ఆస్పత్రి గేట్‌కు తోపుడు బండ్లు అడ్డుగా పెట్టి నిరసన
- సమయపాలన పాటించట్లేదని నిరసిస్తూ ఆందోళన


పిట్లం సీహెచ్‌సీలో ఉదయం 11 గంటలకు ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ


పిట్లం సీహెచ్‌సీ గేటుకు అడ్డుగా పెట్టిన తోపుడు బండ్లు

పిట్లం(జుక్కల్) : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్యులు సమయానికి రావట్లేదని పేర్కొంటూ రోగులు నిరసన వ్యక్తం చేశారు. ఏకంగా సీహెచ్‌సీకి తోపుడు బండ్లు అడ్డుపెట్టి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం జ్వరాలు వచ్చిన చిన్నారులతో, ఇతర రోగాలతో ఇబ్బంది పడుతూ రోగులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాగా ఉదయం 11 గంటలైనా వైద్యులు రాలేదు. ఇక సీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఆగ్రహానికి గురైన రోగులు సీహెచ్‌సీ ఎదుట ఆందోళకు దిగారు. పిట్లం గ్రామానికి చెందిన కిరణ్ తన కూతురు అవంతికకు విపరీతంగా జ్వరం రావడంతో సీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు సమయానికి రాకపోవడంతో ఆగ్రహానికి గురై సెంటర్ గేట్‌కు తోపుడు బండ్లు అడ్డుపెట్టి అక్కడే నిరసనకు దిగారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పడంతో బళ్లను తీసివేశారు. ఉదయం 11 గంటలైన డాక్టర్లు ఎవరూ రాకపోవడంతో రోగుల రద్దీ విపరీతంగా పెరిగింది. రోగుల లైన్ ఆస్పత్రి బయట వరకు చేరడంతో ఆస్పత్రి సిబ్బంది ఆర్‌బీఎస్‌కే డాక్టర్‌ని పిలిపించి రోగులకు పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీలో మొత్తంగా ఆరుగురు వైద్యుల పోస్టులు ఉండగా అందులో ఒకరు రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తుండగా, మరొకరు డిప్యూటేషన్‌పై వస్తూ ఉంటారు. బుధవారం ఇద్దరు కూడా సమయానికి రాలేదు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సుమారు 200 పైన రోగులు పిట్లం ఆస్పత్రికు వస్తుంటారని, వైద్యుల కొరత, ఉన్న వైద్యులు సమయపాలన పాటించక పోవడంతో ఆస్పత్రికు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు.

ప్రైవేట్‌కు వెళ్తున్నాం



రాత్రి నుంచి కండరాల నొప్పి, తీవ్ర జ్వరం రావడంతో ఆస్పత్రిలో చూయించుకుందామని ఉదయం 9 గంటలకే పిట్లం సీహెచ్‌సీకి వచ్చాను. ఉదయం 11గంటలు అయినా వైద్యులు రాలేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి వచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– అజీం, పిట్లం

సమయపాలన లేదు



నా భార్య నిర్మలకు జ్వరం, శరీరంపై దద్దుర్లు వచ్చాయి. మూడరోజులుగా సీహెచ్‌సీకి తిరుగుతూనే ఉన్నా. ఆస్పత్రిలో సమయానికి వైద్యులు ఉండట్లేదు. ఆరోగ్యం క్షీణిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. మాలాంటి వాళ్ల స్థితినైనా వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి.

– హరి, పిట్లం

క్లుప్తంగా

యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి



పిట్లం(జుక్కల్): ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని, 18 ఏళ్ల పూర్తి చేసుకున్న యువతకు ప్రాధాన్యత ఇస్తూ ఓటర్‌గా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయన బుధవారం మండల కేంద్రమైన పిట్లం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ ఎన్నికల వేళ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బీఎల్వోలు పూర్తిచేయాలన్నారు.ఎల్ఆర్ఎస్ కూడా త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శీతల్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్నె శ్రీనివాస్‌కు డాక్టరేట్



భిక్కనూరు : మండల కేంద్రంలోని అహ్మద్ బీఈడీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న మన్నె శ్రీనివాస్ డాక్టరేట్ పట్టాను బుధవారం అందుకున్నారు. రాజస్తాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంలో ఆంగ్లవిభాగంలో 'ది స్టడీ ఆన్ ముల్క్ ఆనంద్ కంట్రిబ్యూషన్ టూ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై డాక్టర్ లోకేష్‌సింగ్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసి యునివర్సిటీకి సమర్పించారు. దీంతో యునివర్సిటీ అధికారులు పరిశీలించి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. ఆంగ్ల విభాగంలో శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ హనీఫ్ పాష తదితరులు అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



భిక్కనూరు : ఆయుర్వేద మొక్కలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆర్ సుధాకర్ గౌడ్, దోమకొండ పోర్ట్ ట్రస్ట్ నిర్వాహకుడు బాబ్జి పేర్కొన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సహకారంతో వారు ఔషధ మొక్కలను నాటారు. విశ్వవిద్యాలయాల్లో ఔషధ మొక్కలు నాటడం ద్వారా చాలావరకు ఆరోగ్య సంబంధమైన సమస్యలు రావన్నారు. క్యాంపస్ ఆవరణలో తులసి, అలోవెరా, విద్యార్థుల జ్ఞాపకశక్తి కోసం సరస్వతి, బ్రహ్మీ, శంకుపుష్ప తదితర మొక్కలను నాటామన్నారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ ద్వారా పాఠశాలలకు కళాశాలలకు కూడా ఔషధ మొక్కలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ హరిత, డాక్టర్ వీరభద్రం, డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత, డాక్టర్ యస్ నారాయణ తదితరులున్నారు.

47 వార్డులో బోరు ప్రారంభం

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని 47 వార్డులో నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం ప్రారంభించారు. వార్డులో నీటి సమస్యను తీర్చేందుకు మున్సిపల్ నిధులు బోరు వేయించి మోటారు బిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ సీఐ చంద్రశేకర్, కౌన్సిలర్‌లు గెరిగంటి స్వప్న, మమత తదితరులున్నారు.

లక్షమంది సభ్యత్వ నమోదు లక్ష్యం


మాట్లాడుతున్న బాణాల లక్ష్మారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా 80 వేల నుండి లక్ష వరకు సభ్యత్వ నమోదు చేయించడమే లక్ష్యంగా నిర్ణయించామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బానాల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 1న జాతీయస్థాయిలో, 2న రాష్ట్రస్థాయిలో, 3న జిల్లాస్థాయిలో, 4న మండలస్థాయిలో, 5న గ్రామ స్థాయిలో సభ్యత్వనమోదు ప్రారంభమవుతుందన్నారు. దీంతోపాటు వచ్చే నెల 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు మొదటి విడత, అక్టోబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండో విడత సభ్యత్వనమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెలాఖరు వరకు సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో 10వేల నుంచి 15వేల వరకు సభ్యత్వ నమోదు చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు మర్రి బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పీఎంపీ, ఆర్ఎంపీ ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం ఎంపీడీవో నరేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వైద్యులు ఆస్పత్రుల్లో అనుమతులు లేకుండా ఆపరేషన్లు, డెంగ్యూ కేసులకు వైద్యం అందిస్తున్నారా అని పరిశీలించారు. డెంగీతో పాటు ఆపరేషన్లు చేసి వైద్యం అందిసే కేసులు నమోదు చేసి ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే మందుల దుకాణాలను పరిశీలించిన నాణ్యతను తనిఖీ చేశారు. ఎంపీవో మలహిరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రైవేటు ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

రామారెడ్డి : రామారెడ్డి మండల కేంద్రంలోని పీఎంపీ-ఆర్ఎంపీల క్లినిక్‌లను రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేశ్ వైద్యసిబ్బందితో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో క్లినిక్‌లను తనిఖీలు నిర్వహించామన్నారు. పరిధి దాటి వైద్యం చూస్తే క్లీనిక్‌లను సీజ్ చేస్తామన్నారు.

గుంతల పూడ్చివేత



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సింగిల్ విండో కాంప్లెక్స్ వరకు ప్రమాదకరంగా మారిన డివైడర్ గుంతలను బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పూడ్చివేయించారు. నెండు నెలలుగా వర్షాకాలంలో వర్షపు నీటికి డివైడర్ గుంతలు పెద్దవి అయ్యాయి. దీంతో వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా మారాయి. ఈ క్రమంలో జీపీ కార్యదర్శి దృష్టికి తేగా వారు గుంతలను పూడ్చివేయించారు.

31 వరకు ఇంటర్ అడ్మిషన్లు



నిజాంసాగర్(జుక్కల్) : ఈనెల 31 వరకు ఇంటర్ అడ్మిషన్లను స్వీకరిస్తున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గోర్గల్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను అభ్యర్థించారు. నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అసాద్ పార్క్, సిబ్బంది రమేశ్, సాయిరాం ఉన్నారు.

చెస్ క్రీడాకారుడికి సన్మానం



పెద్దకొడప్‌గల్ (జుక్కల్) : కజకిస్తాన్, రష్యాలో నిర్వహించిన చెస్ పోటీలో పాల్గొన్న విద్యార్థి గణేశ్‌కు ఘనంగా ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ సన్మానించారు. మండలంలోని కుబ్యానాయక్ తండాకు చెందిన గణేశ్ అనే విద్యార్థి నారాయణ ఖేడ్ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చదువుతున్నాడు. కజకిస్తాన్, రష్యాలో ఏర్పాటు చేసిన చెస్ పోటీల్లో గణేశ్ పాల్గొన్నాడని ఈ పోటీల్లో భారత్ నాల్గో స్థానంలో నిలిచిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

బోధన్‌రూరల్: భూలక్ష్మీ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. వివరాలు.. మంగళవారం సాయంత్రం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అంగన్‌వాడీ టీచర్ శిరీష తాళం వేసి ఇంటికెళ్లారు. విధుల్లో భాగంగా బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టి ఉంది. 2 గ్యాస్ సిలిండర్లు, వంట సామగ్రి, ఇతర వస్తువులు(సుమారు రూ.6 వేలు) చోరీకి గురయ్యాయి. అంగన్‌వాడీ టీచర్ శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్ : విద్యార్థులు వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. కలెక్టర్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి వాటిని విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని విద్యాశాఖాధికారులను సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. డీఈవో రాజు, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీఆర్డీవో సురేందర్, ఎంఈవో ఎల్లయ్య, పంచాయతీ సెక్రెటరీ తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలి

వైద్య సిబ్బంది హెడ్ క్వార్టర్స్ లోనే ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మండలంలోని గర్గుల్ పల్లె దవాఖానా, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పల్లె దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఫార్మసీని తనిఖీ చేశారు. జ్వర పీడిత సర్వే పగడ్బందీగా నిర్వహించాలన్నారు. వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రైతుల వివరాలు వారంలోగా సేకరించాలి

పంటరుణం మాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ వ్యవసాయ అధికారులు యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం అడ్లూర్ క్లస్టర్‌లోని ఇస్రోజీవాడి రైతు వేదికను ఆయన సందర్శించారు. కామారెడ్డి మండలంలో పెండింగ్‌లో ఉన్న 519 కుటుంబాల ధ్రువీకరణ వారం లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఏడీఏ అపర్ణ, ఎంఏవో పవన్ తదితరులున్నారు.

రైతుకు అభినందన

కామారెడ్డి మండలం గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మక్‌పల్లి(జి) గ్రామంలో బుధవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు స్వామి తనకున్న రెండెకరాల భూమిలో కొంత భాగంలో ఫారం పాండ్‌ని తవ్వుకున్నాడు. దానిని ప్రస్తుతం చేపల చెరువుగా మార్చుకోగా కలెక్టర్ చేతుల మీదుగా చేప పిల్లలను అందులో విడుదల చేశారు. ఇంకొంత భాగంలో కోళ్ల షెడ్డును నిర్మించుకుని వివధ రకాల కోళ్లను పెంచుకుంటున్నారు. గేదెల కోసం షెడ్ నిర్మించుకున్నారు. కొబ్బరి, మామిడి, నిమ్మ చెట్లు పెంచుతుండడంతో రైతు స్వామి కృషిని కలెక్టర్ కొనియాడారు. స్వామికి సహకరించిన ఎంపీడీవో నాగవర్ధన్‌ను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ జెడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఎంపీడీవో నాగవర్ధన్, ఏపీవో, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


పిట్లంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి రెడ్‌క్రాస్ సభ్యులు బుధవారం పిట్లం ప్రధాన వీధుల గుండా డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవరెడ్డి మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ యువతను చైతన్య పరచాలనే ఉద్దేశంతో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కిషన్, రెడ్‌క్రాస్ బాన్సువాడ డివిజన్ చైర్మన్ వేణుగోపాల్, లయన్స్ క్లబ్ కోశాధికారి బాలు, సభ్యులు ప్రమోద్, విద్యార్థులు, టీచర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్‌స్కీం పేరుతో కొత్త పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. 2025 ఏప్రిల్ 1న నుంచి అమల్లోకి వస్తున్న యూనిఫైడ్ పెన్షన్ పథకంకు తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, పాత పెన్షన్ ను ప్రవేశపెట్టాలని అన్నారు. యూనిఫైడ్ పెన్షన్ ప్రకారం 25 సంవత్సరాల సర్వీసు చేసిన ఉద్యోగి చివరి 12 నెలల జీతంలో 50 శాతం పెన్షన్‌గా చెల్లిస్తారని అన్నారు. ఇది సీపీఎస్‌కు మరో రూపమే తప్ప పాత పెన్షన్ విధానం కాదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సంతోషి, లక్యానాయక్, ప్రమోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వానాకాలంలో నీటి కటకట


రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

రామారెడ్డి : వానాకాలంలో తాగునీటి కటకట తప్పడం లేదు. నిత్యం మహిళలు బిందెలు పట్టుకొని రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో వారంరోజులుగా తిప్పలు తప్పడం లేదు. వర్షాభావ ప్రభావంతో నీటి సరఫరా చేసే పలు నీటి ట్యాంకులు నిండకపోవడం కూడా నీటి సమస్యకు ప్రధాన కారణంగా మారింది. మండల కేంద్రం రామారెడ్డిలో రెండో వార్డు, మూడో వార్డుల్లో నీటి సమస్యతో మహిళలు బుధవారం రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ట్యాంకర్లతో మీటి సరఫరా కొన్ని రోజులపాటు నిర్వహించారని పూర్తిగా నీళ్ల రాకపోవడంతోనే రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు చెప్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని మహిళలు డిమాండ్ చేశారు. రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో ఉదయం పలు బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంక్యాంప్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో గురువారం ఇంటర్ ఎంపీసీ, బీపీసీ కోర్సుల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎంపీసీ ఫస్టియర్‌లో ఎస్సీ కోటాలో 11, మైనార్టీలకు 1, క్రిస్టియన్ 1 చొప్పున 13 సీట్లు ఖాళీగా ఉన్నాయి.అలాగే బైపీసీలో ఓసీ కేటగిరీలో 1 సీటు అందుబాటులో ఉంది. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి గలవిద్యార్థినులు కళాశాలపనివేళలోసంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుంది. గ్రామంలో విష జ్వరాలు ప్రబలడంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన విషయం విదితమే. గ్రామంలో ఇంటింట సర్వే నిర్వహించారు. జ్వర పీడితులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఆస్మా, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

కరెంటు షాక్‌తో యువకుడు..


అభిలాష్(ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): మాయాపూర్ గ్రామానికి చెందిన గుడ్డోళ్ల అభిలాష్(20) అనే యువకుడు కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు.. పిన్నమ్మ కూతురి వివాహానికి అభిలాష్ తన తల్లితో కలిసి రెంజల్ మండల కేంద్రానికి వెళ్లారు. అక్కడ పెళ్లి వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి హల్దీ వేడుకలు జరుగుతుండగా ఫోన్ రావడంతో అభిలాష్ దాబాపైకి వెళ్లాడు. ఫోన్ మాట్లాడుతూ పొరపాటున పెళ్లి వేడుక కోసం ఏర్పాటు చేసిన లైటింగ్‌కు చేయి తగలడంతో కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం నందిపేట మండలం మాయాపూర్ గ్రామానికి తీసుకురాగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: కారు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం సీతారామ్ నగర్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఆర్టీసీ ఆస్పత్రిలో చూపించుకొని తిరిగి ఎలక్ట్రానిక్ బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ డిపో–1 ముందర వెనక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చల్లా భూలక్ష్మీ తలకు గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

మోర్తాడ్: మండల కేంద్రంలో భగత్‌సింగ్ కాలనీకి చెందిన దండుగుల వెంకటి(35) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రాత్రిపూట ఇంటి వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై మరణించి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడు వ్యవసాయ కూలీ. భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ ..

భిక్కనూరు: జంగంపల్లి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వాపూర్‌కు చెందిన రాగి బాలమణి(49) మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. వివరాలు.. బాలమణి స్థానికంగా ఉన్న ఎల్లమ్మ దేవాలయం వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో బాలమణికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికి మృతి చెందారు. మృతురాలి కుమారుడు మహేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. ఆస్పత్రి ఆవరణలో అటెండెంట్స్ షెల్టర్ వద్ద ఒక వ్యక్తి(42–45) కింద పడిపోయి ఉన్నట్లు పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నారు. ఆయన వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే వారు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు 8712659837, 871259714, 08462–220150 నంబర్ల ద్వారా సమాచారమివ్వాలని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి


గాయపడిన చిన్నారి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం పలువురిపై కుక్కలు దాడులకు పాల్పడ్డాయి. పట్టణంలోని ఓ చిన్నారి మరియ(5)పై దాడి చేయడంతో చెవి, చేతులపైన తీవ్రగాయాలయ్యాయి. చిన్నారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. అలాగే మామిడిపల్లిలో పలువురిపై కుక్కలు దాడిచేశాయి. అలాగే చిన్నారి కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజును డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన భూ తగాదాలు

- చికిత్స పొందుతూ వ్యాపారి మృతి


పాత విశ్వనాథం (ఫైల్)

కామారెడ్డి క్రైం: భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాపారి పాత విశ్వనాథం (64) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందాడు. దాడికి పాల్పడిన పలువురిపై పట్టణ పోలీసులు హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉండే వడ్డీ వ్యాపారి విశ్వనాథంకు, దేవునిపల్లిలో నివాసం ఉంటున్న బిల్డర్ లక్ష్మీబాయికి మధ్య చాలా రోజులుగా ఆర్థిక లావాదేవీలు నడిచాయి. కొద్దిరోజులుగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. నిర్మాణాల నిమిత్తం తాను అప్పుగా తీసుకున్న డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లించినప్పటికి విశ్వనాథం తనను ఇంకా బాకీ ఉన్నావని వేధింపులకు గురిచేస్తున్నాడని, మార్ట్‌గేజ్ చేసుకున్న ఆస్తిని తిరిగి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఈ నెల 12న లక్ష్మీబాయి సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు యత్నించింది. పురుగుమందు సేవించిన ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత ఆమె ఫిర్యాదు చేయడంతో దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విశ్వనాథంతో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా మంగళవారం విశ్వనాథం దగ్గర్లోని గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా లక్ష్మీబాయి, మరో నలుగురు వ్యక్తులు ఎదురుపడ్డారు. డబ్బుల విషయంలో మాటలు పెరిగి వారంతా కలిసి విశ్వనాథంపై దాడి చేశారు. గాయపడిన విశ్వనాథంను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి విశ్వనాథం మృతిచెందారు. పట్టణ పోలీసులు విచారణ జరిపి లక్ష్మీబాయితో పాటు దాడికి పాల్పడిన మిగతా వారిపై కూడా హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

బిచ్కుంద(జుక్కల్): ఖద్‌గాంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు స్థానిక తహసీల్దార్ సురేష్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నందుకు రూ.3 వేల జరిమానా విధించామన్నారు. ఎవరైన అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే 9491036923 నెంబరుకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని తక్కడ్‌పల్లి వద్ద బుధవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంజీరా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తుల సమాచారం మేరకు తక్కడ్‌పల్లి వద్ద పట్టుకున్నామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు.

సిరికొండలో మరో ట్రాక్టర్..

సిరికొండ: మండలంలోని ఒంటిప్ప తండా వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ బుధవారం తెలిపారు.తండాకు చెందిన నరేష్ ఎ లాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండటంతో పట్టుకొ ని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పొతంగల్ మండలం సుంకిని శివారులో స్వాధీనం చేసుకున్న 13 ట్రాక్టర్ల ఇసుక డంప్‌కు బుధవారం వేలం నిర్వహించారు. పొతంగల్ తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో సుంకిని గ్రామానికి చెందిన యాదవ్ రావ్ రూ. 8,400కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.